క్లుప్తంగా

ఉచిత యూనాని కంటి వైద్య శిబిరం

గోనెగండ్ల: మండల కేంద్రంలో ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో శనివారం యూనాని డాక్టర్ హాజీ హకీమ్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికీ వైద్యులు పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. డాక్టర్ హాజీ హకీమ్ మాట్లాడుతూ నిరుపేదలు వైద్యం చేయించుకునే స్థోమత లేకపోవడంతో చూపును కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాను తయారు చేసిన యూనాని చుక్కల మందు ఎందరికో చూపును ప్రసాదించిందని తెలిపారు. ప్రతినెల మొదటి శనివారం గోనెగండ్లలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు హాఫీజ్, చాంద్‌బాషా, జలీల్, యూనుస్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న డీఎస్పీ హేమలత

ఆదోని సెంట్రల్: విద్యార్థులు చెడు అలవాట్లకు, చెడు సహవాసాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ హేమలత సూచించారు. పట్టణంలోని విశ్వనారాయణ జూనియర్ కళాశాలలో శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. చాలా మంది యువతీయువకులు సెల్‌ఫోన్లకు అడిక్ట్ అయ్యి సైబర్ ఉచ్చులో పడుతున్నారన్నారు. బాల్య వివాహాల వలన వచ్చే అనర్థాలను వివరించారు. అందుకే వాటన్నిటికి దూరంగా ఉండాలన్నారు. బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అప్పుడు వరకట్నం వంటి సమస్యలు ఉండవన్నారు. కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు రాజేశ్వరి, పోలీసు కానిస్టేబుల్ మల్లప్ప, ముంతాజ్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి



మృతిచెందిన గఫ్రోజ్

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డులో ఉన్న ఓ హోటల్‌లో వంట మనిషిగా పనిచేస్తున్న ఒడిస్సా రాష్ట్రానికి చెందిన గఫ్రోజ్(28) విద్యుత్‌షాక్‌కు గురై శనివారం మృతిచెందాడు. త్రీటౌన్ సీఐ రామలింగమయ్య తెలిపిన మేరకు వివరాలు.. ఒడిస్సా రాష్ట్రం మెదాప్ జిల్లా నియాల్లి గ్రామానికి చెందిన గఫ్రోజ్ ఆరేళ్లుగా ఎమ్మిగనూరు రోడ్డులోని ఓ హోటల్‌లో వంట మనిషిగా పని చేస్తున్నాడు. శనివారం హోటల్‌లోని టేబుల్‌కు విద్యుత్ ఎర్తింగ్ కావడంతో అక్కడున్న సామాన్లను ముట్టుకున్న గఫ్రోజ్ విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని తెలపడంతో పోస్టుమార్టంకు తరలించారు. మృతుడికి తండ్రి షేక్ అబ్దుల్ అమీద్ ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఘనంగా పాముల నారాయణ తాత ప్రభోత్సవం



భక్తుల మధ్య ఊరేగుతున్న స్వామి వారి ప్రభోత్సవం

కోసిగి: మండల పరిధిలోని పల్లెపాడు గ్రామంలో పాముల నారాయణ తాత స్వామి వారి ప్రభోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం నారాయణ తాత ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. నారికేలలు, ఫలపుష్పాలు సమర్పించి హారతులు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం మహిళలు కలశాలు చేతపట్టి, మేళతాళాలు, డప్పువాయిద్యాలతో భక్తుల మధ్య స్వామి వారి ప్రభోత్సవం ఘనంగా నిర్వహించారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి సన్మానం



వ్యాయామ ఉపాధ్యాయుడు నరసింహరాజును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మంత్రాలయం రూరల్ : ప్రభుత్వం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్పోర్ట్స్ ఎక్సలెన్సీ విభాగంలో స్థానిక హైస్కూలు వ్యాయామ ఉపాధ్యాయుడు నరసింహరాజు అవార్డుకు ఎంపికయ్యారు. శనివారం పాఠశాలలో సదరు ఉపాధ్యాయుడిని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, ఉపాధ్యాయులు సన్మానం గావించి అభినందనలు తెలిపారు.

ఆగస్టు 26న ఎమ్మిగనూరులోని వీరబ్రహ్మేంద్ర ట్రేడర్స్ నుంచి అక్రమంగా కర్ణాటక వైపు ఎరువులు తరలిస్తుండగా మాధవరం చెక్‌పోస్టులో వ్యవసాయాధికారులు దాడులు చేశారు. దాడుల్లో రూ.10,660 విలువజేసే యూరియా, రూ.6,730 విలువగల డీఏపీ, రూ.41,200 విలువైన 19.19.19 రకం, రూ.60,200 విలువజేసే 10.26.26 రకం ఎరువులు సీజ్ చేసి కర్ణాటక రైతుపై కేసు నమోదు చేశారు. ఎరువుల అక్రమ రవాణా, వ్యాపారం సాగుతుందనడానికి ఇదే నిదర్శనం.



కాచాపురంలో పట్టుబడ్డ అక్రమ ఎరువులు

అన్నదాత ఏకరువు..!

- యూరియా కొరతతో కర్షకుల కన్నీళ్లు
- అక్రమ నిల్వలు.. అడ్డదారుల్లో రవాణా
- వేడుక చూస్తున్న వ్యవసాయాధికారులు



మంత్రాలయంలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

మంత్రాలయం: ఎరువు కోసం అన్నదాతలు ఏకరువు.. మునుపెన్నడూ ఎరుగం. కూటమి ప్రభుత్వం ఎరువులు, విత్తనాల విపత్తును సృష్టించింది. యూరియా విపత్తుతో కర్షకలోకం కన్నీళ్లు పెడుతోంది. కూటమి నేతల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ.. వారిని ప్రసన్నం చేసుకునే దుస్థితి తెచ్చిపెట్టింది. అక్రమంగా ఎరువులు తరలుతున్నా.. డీలర్లతో అక్రమ నిల్వలు మగ్గుతున్నా వ్యవసాయాధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తే తప్ప ఇక్కడి వ్యవసాయాధికారుల్లో చలనం శూన్యం. కాసుల మోజులో కర్షకుల గోడును గాలికి వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

యూరియా విపత్తు

మంత్రాలయం నియోజకవర్గంలో ఖరీఫ్‌లో 1,57,159 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో అత్యధికంగా పత్తి 1,22,150 ఎకరాల్లో, వరి 13,772 ఎకరాలు, మిరప 8,372 ఎకరాలు సాగుచేయగా మిగతా పంటలు 12,865 ఎకరాల్లో వేశారు. రైతులకు సరిపడా ఎరువులు సమకూర్చడంలో కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. ముఖ్యంగా యూరియా విషయంలో విపత్తును సృష్టించి రైతుల కంట కన్నీళ్లు పెట్టిస్తోంది. నియోజకవర్గంలో సాగుకు 18 వేల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అవసరం ఉంది. కాగా యూరియా 18,260 మెట్రిక్ టన్నులకు గానూ కేవలం 11,067 మెట్రిక్ టన్నులు వచ్చింది. ఇంకా ఏడు వేల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉంది. పెద్దకడబూరుకు 2,775 మెట్రిక్ టన్నులకు గానూ 1,675 మెట్రిక్ టన్నులు, కౌతాళానికి 5,600 మె.ట.కు గానూ 3,630 మె.ట.లు వచ్చింది. కోసిగికి 3,120 మె.టన్నులు అవసరంకాగా 2880 మె.టన్నులు సరఫరా చేశారు. మంత్రాలయానికి 2,764 మెట్రిక్ టన్నులకుగానూ 2882 మెట్రిక్ టన్నులు వచ్చింది.

నిద్రావస్థలో వ్యవసాయాధికారులు

యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే వ్యవసాయాధికారులు కార్యాలయాలకు పరిమితమయ్యారు. రైతు సేవా కేంద్రాలకు వచ్చిన ఎరువులను టీడీపీ నేతల కను సన్నల్లో పంపకాలు కానిస్తున్నారు. బడా రైతులు ఎవ్వరూ కూడా ఎరువుల దుకాణాలు, రైతు సేవా కేంద్రాలతో నిలుచోవడం లేదు. దీన్ని బట్టి బడా రైతులకు ఎలా ఎరువులు ముడుతున్నాయో వ్యవసాయాధికారులే సెలవివ్వాలి. టీడీపీ అనుకూల వర్గాలకు అందిన తర్వాతనే సాధారణ రైతులకు యూరియా ముడుతోంది. అంతేగాక ప్రైవేటు దుకాణాలకు ఎరువులు ఎలా విక్రయిస్తున్నారు.. యూరియా కొరత ఎలా సృష్టిస్తున్నారో పట్టించుకోని వైనం.

సరిహద్దులు దాటించేస్తున్నారు..

యూరియా లేక స్థానిక రైతులు నానా అవస్థలు పడుతుంటే కొందరు డీలర్లు యూరియాను దాచేసి దోచేస్తున్నారు. ఓ డీలర్ ఏకంగా సరిహద్దులు దాటి కర్ణాటకకు యూరియాతో పాటు కాంప్లెక్స్ ఎరువులు తరలించాడు. ఇంకో డీలర్ ఒంగోలు నుంచి అక్రమంగా తెచ్చుకుని వందలాది బస్తాలను దాచేశాడు. బిల్లులు లేకుండానే ఎరువుల మాఫియాను సల్లంగా సాగిస్తున్నారు. మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామంలో జూలై 16న పాండురంగ ట్రేడర్స్ బిల్లులు సరిగా లేవని వ్యవసాయాధికారులు రూ.8.92 లక్షల ఎరువులను సీజ్ చేశారు. ఆగస్టు 20వ తారీఖున మాధవరంలోని బాలాజీ ట్రేడర్స్‌లో బిల్లులు లేవని 200 బస్తాలు ఫ్యాక్టు, 25 బస్తాల 10.26.26.26 రకం, 165 బస్తాల 15.15.15 రకం. 30 బస్తాల ఎంవోపీ రకం ఎరువులు సీజ్ చేయబడ్డాయి. సెప్టెంబర్ 3న కాచాపురం గ్రామంలోని శ్రీరామ ట్రేడర్స్‌లో 300 బస్తాల యూరియా, 400 బస్తాల కాంప్లెక్స్ ఎరువులు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఇప్పటి వరకు మంత్రాలయం మండలంలో మూడు 6ఏ కేసులు నమోదుకాగా రూ.11.84 లక్షల విలువైన ఎరువులు సీజ్ చేయడం విశేషం

యూరియా కొరత లేకుండా చర్యలు

మంత్రాలయం మండలానికి ఖరీఫ్ సీజన్‌లో ఈనెల వరకు అవసరమైన యూరియా మంజూరైంది. 2885 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేయడం జరిగింది. మండలంలో యూరియా కొరత రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం.

– జీర గణేష్, ఏఓ, మంత్రాలయం

విజిలెన్స్ అండ్ ఎన్స్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వస్తే తప్ప అసలు గుట్టు బయటపడని దుస్థితి. ఇకనైనా రైతులకు సరిపడా ఎరువులు సరఫరా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బోధనేతర కార్యక్రమాలు వద్దు

ఆదోని సెంట్రల్: ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించి బోధనకే పరిమితం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయడు కోరారు. శనివారం పట్టణంలోని పలు పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం సంఘం నాయకులు చేపట్టారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు పాఠాలు చొప్పాల్సిన ఉపాధ్యాయుల చేత పలు రకాల యాప్‌లు, ఆన్‌లైన్ పనులు, శిక్షణ తరగతుల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. నూతనంగా ప్రవేశపెట్టిన మూల్యాంకన పత్రాలతో ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. వీటిని ఉపసంహరించుకొని పాత పద్ధతినే కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రవి, భీమరాజు, లోక్యానాయక్, శ్రీనివాసులు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ విధానాలపై సీపీఐ నిరసన

ఆదోని రూరల్/ఎమ్మిగనూరుటౌన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత దిగుమతులపై విధించిన 50 శాతం సుంకాలకు వ్యతిరేకంగా పట్టణంలో శనివారం వామపక్ష నాయకులు నిరసన తెలియజేశారు. ఆదోని మున్సిపల్ మెయిన్ రోడ్డుని పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో, ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుదర్శన్, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి తిమ్మన్నగౌడ్, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శి వీరేష్, కల్లుబావిరాజు మాట్లాడారు. భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50 శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ప్రకటించడం సరైన నిర్ణయం కాదన్నారు. దేశ సముద్ర ఉత్పత్తుల్లో 40 శాతం ఎగుమతులు ఆంధ్రప్రదేశ్ నుంచి అవుతున్నాయన్నారు. దీంతో రొయ్యలు, చేపల రైతులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారన్నారు. కార్యక్రమంలో రమేష్‌కుమార్, అంజిత్‌గౌడ్, ఎల్లప్ప, జి.రంగన్న, పంపణ్ణ గౌడ్, గోవిందు,రాజులు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ కొనుగోళ్లు ప్రారంభం



వేరుశనగకాయలను పరిశీలిస్తున్న ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని అర్బన్: గత పది రోజుల నుంచి ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో వేరుశనగకాయల మార్కెట్‌లో గందరగోళం నెలకొంది. గురువారం సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన చర్చలు సఫలం కావడంతో శనివారం గ్రేడింగ్ లేకుండా సజావుగా వేరుశనగకాయల వ్యాపారస్తులు కొనుగోళ్లు చేపట్టారు. ఎక్కువ తేమ ఉన్న వేరుశనగకాయలను కొంతమేర ఆరబోశారు. దీంతో వ్యాపారులు లాభసాటి అయిన ధరలు వేసుకున్నారు. టెండర్ ప్రకటన వచ్చిన వెంటనే ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ రాశులు పోసిన, ఆరబోసిన వేరుశనగకాయలను పరిశీలించారు. రైతుల వద్దకు వెళ్లి వేరుశనగకాయలను చూసి ధర ఎంత పలికిందని అడిగి తెలుసుకున్నారు. గ్రేడింగ్ లేకుండా వ్యాపారులు కొనుగోలు చేశారని, వెంటనే ఖాళీ సంచులు ఇవ్వడంతో నింపుతున్నారని, తాము నాలుగు గంటల్లోపు ఇళ్లకు వెళ్లే పద్ధతి తీసుకొచ్చినందుకు సబ్‌కలెక్టర్‌కు రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు. సజావుగా జరిగిన కొనుగోళ్లపై సబ్‌కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. సబ్‌కలెక్టర్‌తో పాటు కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, కార్యదర్శి వీరభద్రగౌడ్, సభ్యులు రాజాగౌడ్, రఘు, రైతులు, ఏజెంట్లు ఉన్నారు.

నానో యూరియాతో లాభాలు

గోనెగండ్ల: నానో యూరియాతో ఎన్నో లభాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. శనివారం మండల కేంద్రం గోనెగండ్లలో కోరమండల్ ఎరువుల షాపును తనిఖీ చేసి, నానో యూరియాపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులందరూ యూరియాని పైపాటుగా వేసే బదులు నానో యూరియా వాడాలన్నారు. నానో యూరియాలో 16శాతం నత్రజని ఉంటుందని, దీనిని పిచికారీ చేస్తే నేరుగా ఆకుల ద్వారా మొక్కకు చేరి నాణ్యమైన దిగుబడి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత, విస్తరణ అధికారి పులిరాజు, శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు మూడు బస్తాల వరకు యూరియా



హాల్విలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

కౌతాళం: ప్రతి రైతుకు రెండు నుంచి మూడు బస్తాల వరకు యూరియాను పంపిణీ చేయాలని తహసీల్దారు రజినీకాంత్‌రెడ్డి ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని హాల్వి గ్రామంలోని ప్రైవేట్ డీలర్ల షాపులను వ్యవసాయాధికారి శేషాద్రితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మండలంలో ఏ షాపులకు ఎన్ని యూరియా బస్తాలు వచ్చాయో లెక్క ఉందన్నారు. బ్లాక్ మార్కెట్లో అమ్మిన లేదా కృత్రిమ కొరత సృష్టించిన లైసెన్స్‌లు రద్దు అవుతాయని హెచ్చరించారు.

ఆశ్రమానికి వృద్ధురాలి తరలింపు



వృద్ధురాలిని ఆశ్రమానికి తరలిస్తున్న వేదాస్ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: నడవడానికి చేతకాక బక్కచిక్కి శల్యమైన ఓ వృద్ధురాలిని పట్టణంలోని శివ సర్కిల్ వద్ద ఉన్న అపోలో ఫార్మసి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లారు. ఆమె రెండు రోజులుగా అక్కడే ఎవరైనా ఏమైనా ఇస్తే తిని వుంటోంది. ఆ ప్రాంత వాసులు స్థానిక వేదాస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులకు సమాచారం అందించారు. దీంతో శనివారం సంస్థ వ్యవస్థాపకుడు సునీల్‌కుమార్, శివసర్కిల్‌లోని చికెన్ పకోడి బాషా కలిసి వృద్ధురాలికి సపర్యలు చేశారు. ఆమె వివరాలు అడగ్గా తన మాత్రం లింగమ్మ అని మాత్రం చెబుతోంది. ఆమెను వారు ఆటోలో ఆదోనిలోని జీవన జ్యోతి అశ్రమానికి తరలించారు.

సంక్షిప్తం

రేషన్ బియ్యం స్వాధీనం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని మంత్రాలయం రోడ్డులో ఉన్న ఉప్పర కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన 28 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి శనివారం రాత్రి తెలిపారు. ఉప్పర కాలనీలోని రేకుల షెడ్‌లో అక్రమంగా బియ్యం బస్తాలు నిల్ల ఉన్నాయనే సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి పట్టుకున్నట్లు చెప్పారు. బస్తాలు ఎవరు నిల్వ ఉంచారు అనేదానిపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని బియ్యం బస్తాలను సీజ్ చేశామన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని టౌన్: మున్సిపాలిటీలోని వార్డు, సచివాలయం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నా చేపట్టారు. వినతి పత్రాన్ని కమిషనర్ ఎం.కృష్ణకు అందజేశారు. ఉద్యోగులు వీరేష్, అమరేష్, చంద్ర, మహేష్, పద్మ, లలితమ్మ, భువనేశ్వరి, శాంతి, రాధ, దేవిక, ప్రహ్లాద తదితరులు మాట్లాడారు. వార్డు సచివాలయం ఉద్యోగులు వలంటీర్ల విధులను నిర్వర్తించాలని ఆదేశించడం తగదన్నారు. ఇంటింటి సర్వే ఎత్తి వేయాలన్నారు.

నేడు ఉరుకుంద ఆలయం మూసివేత

కౌతాళం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం తలుపులు ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు మూసివేస్తున్నట్లు అలయ డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ శతబిష నక్షత్ర కుంభరాశి యందు రాహుగ్రస్త చంద్రగ్రహణం ఉన్నందున ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆలయ ప్రధాన తలుపులు మూసివేస్తున్నట్లు వెల్లడించారు. చంద్రగ్రహణం అనంతరం సోమవారం తెల్లవారు జామున 4.30లకు ఆలయంలో సంప్రోక్షణ, గణపతి పూజ, వివిధ పూజల అనంతరం ఆలయం తలుపులు తెరుస్తామని చెప్పారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

చర్యలు తీసుకోవడంలో విఫలం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న రవీంద్రభారతి, శారద కమిటీ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని ఐక్య విద్యార్థి సంఘ నాయకులు ఉదయ్, శేఖర్, ఆఫ్రిది, రఘునాథ్, కృష్ణ ఖాజ ఆరోపించారు. శనివారం ఆయా పాఠశాలల ఎదుట ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బైఠాయించి ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ నిబంధనలు పాటించడం లేదని తెలిసినా ఎంఈఓ ఆంజినేయులు పట్టించుకోకుండా ఆయా పాఠశాలల యాజమాన్యాలకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ఆయా పాఠశాలల్లో అర్హత లేని వారితో విద్యాబోధన కొనసాగిస్తున్నారన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు కార్యదర్శి ప్రకాశం, సర్పంచ్ పాల్‌దినకర్‌ల సమక్షంలో శనివారం గ్రామంలోని వైఎస్సార్ కాలనీ, ఎస్సీ కాలనీ మెయిన్‌బజార్‌లలో డ్రైనేజీల్లో పూడికతీత పనులను కార్మికులతో పాటు అదనంగా ఎరిగేరికి చెందిన ప్రైవేట్ కార్మికులతో చేయించారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి

మంత్రాలయం రూరల్ : ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకొని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాలపల్లికి చెందిన ఉపేంద్ర (21) కోలుకోలేక శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మాలపల్లికి చెందిన ఈశ్వర్, సుజాత దంపతులు కుమారుడు ఉపేంద్ర ఈనెల 1వ తారీఖున ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. గాయలపాలైన అతడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆదోనిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు తీసుకెళ్లగా పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి కనుమూశాడు. ఉపేంద్ర ట్రాక్టర్ డ్రైవర్, పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఉపేంద్ర పెళ్లి కోసం, పంటల కోసం తండ్రి అప్పులు చేయడంతో మనస్తాపానికి గురై మద్యానికి అలవాడు పడ్డాడు. ఈ నేపథ్యంలో 1వ తేదీన సాయంత్రం ఇంట్లో అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మృతుడి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ వివరించారు.

‘పల్లె’ల్లో సమస్యల వెల్లువ

నందవరం : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా స్పెషల్ అధికారులు శనివారం మండలంలో పర్యటించారు. మండల కేంద్రంలో జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి, మాచాపురం గ్రామంలో స్పెషల్ అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కొండయ్య, ఇబ్రహీంపురంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ జోహార్ బాబు పర్యటించారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. మండల కేంద్రంలో జెడ్పీ పాఠశాలలో గదుల కొరత, డైనింగ్ హాల్, తాగునీటి సమస్యపై ఉపాధ్యాయులు జెడ్పీ సీఈఓకి విన్నించారు.

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రారంభించిన నాడు– నేడు పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో విద్యార్థులు చదువుకోవడానికి గదుల కొరత ఏర్పడిందని, త్వరగా ప్రస్తుత ప్రభుత్వం పెండింగ్ బిల్లు మంజూరు చేసి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని బనవాసిలో ప్రత్యేకాధికారిణి జిల్లా వెల్ఫేర్ అధికారిణి ప్రసూన, టీఎస్ కూళ్లూరులో డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, కడిమెట్లలో ఏపీఎస్‌ఐడీసీ డీఈ రామకృష్ణ, సోగనూరులో జిల్లా పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఈఈ చంద్రమోహన్‌రావులు పర్యటించి గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణి ప్రసూన బనవాసి ఏపీ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

మంత్రాలయం రూరల్ : ప్రభుత్వం చేపట్టిన పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, నారాయణపురంలో టాన్స్‌పోర్టు అధికారి శాంతాకుమారి, వగరూరులో ఆర్‌అండ్‌బీ ఈఈ పద్మనాభరెడ్డి పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. వగరూరు గ్రామంలో మంచి నీటి సమస్య ఉందని, తుంగభద్ర నది ఎస్‌ఏపీ స్కీం నుంచి తాగునీరు సరఫరా చేయాలని గ్రామస్తులు కోరారు. గ్రామంలో సీసీ రోడ్లు, పాఠశాలలకు ప్రహరీ నిర్మించాలని కోరారు. హెల్త్ క్లీనిక్ సెంటర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని అడిగారు.

ఆదోని రూరల్: మండలంలోని చిన్నగొనేహాల్ గ్రామంలో ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పల్లెకు పోదాం కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, ఓహెచ్ఎస్ఆర్, కాలనీలు, శ్మశానవాటిక, రోడ్లు, నీటి సరఫరా వ్యవస్థ, ఇళ్ల నిర్మాణాలు తదితర అంశాలను ప్రత్యక్షంగా తనిఖీ చేశారు.

పెద్దకడబూరు : మండల కేంద్రంలో మండల స్పెషల్ ఆఫీసర్ నాగరాజ రావు, పీకలబెట్ట గ్రామంలో ఈడీ బీసీ కార్పొరేషన్ అధికారి జాకీర్ హుసేన్, నాగాలపురం గ్రామంలో ఆర్ఐఓ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ లాలెప్పలు పర్యటించారు.

కోసిగి: స్థానిక జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, మండలంలోని ఆర్లబండ గ్రామంలో డీఎస్‌డీఓ భూపతి రావు, కడదొడ్డి, కందుకూరు గ్రామాల్లో జిల్లా డెంగీ, మలేరియా నివారణ అధికారి నూకరాజులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు.

గోనెగండ్ల: మండలంలోని గోనెగండ్లలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బీసీ బాలికల వసతి గృహాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి వరలక్ష్మి మండల అధికారులతో కలిసి తనిఖీ చేశారు. అలాగే అలువాల గ్రామంలో ప్రాథమిక పాఠశాలను జిల్లా బీసీ వెల్ఫేర్ కోఆర్డినేటర్ శ్రీదేవి పరిశీలించారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



ముళ్ల పొదల మధ్య మునిగిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పెద్దకడబూరు : అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెద్దపెద్ద ముళ్లపొదులు, తీగలు పెరిగి ట్రాన్స్‌ఫార్మర్ కనిపించకుండా కప్పేశాయి. మండల పరిధిలోని గవిగట్టు గ్రామంలో రోడ్డుకు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పాఠశాలకు కూడా దగ్గరే ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌పై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించడంతో చుట్టూ ముళ్లకంప పెరిగి ప్రమాదకరంగా మారింది. దానికి తోడు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎటువంటి ప్రహరీ లేకపోవడంతో అటుగా వస్తున్న విద్యార్థులకు, ప్రజలకు ప్రమాదం జరిగే అవకాశం కూడా ఉంది. ప్రస్తుత వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో ఏదైన అంతరాయం ఏర్పడితే మరమ్మతులు చేపట్టడానికి కూడా భయపడాల్సిన పరిస్థితి. దీని వల్ల కొన్ని సమయాల్లో మరమ్మతులకు ఆలస్యం కూడా అవుతోంది. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ఇప్పటికైనా మేల్కొని ముందస్తు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆలయాల్లో పూజలు

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు తరలివచ్చి పూజలు చేపట్టారు. కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కౌతాళంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున అర్చకులు స్వామివార్లకు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు.

ఉపాధ్యాయులు మార్గ నిర్దేశకులు



మాట్లాడుతున్న డీఎస్పీ ఎంఎస్. భార్గవి

ఎమ్మిగనూరురూరల్: ఉపాధ్యాయులు విద్యార్థులను సన్మార్గంలో పయనింపచేసే మార్గ నిర్దేశకులని డీఎస్పీ ఎంఎస్ భార్గవి అన్నారు. శనివారం మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు గౌరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు హాజరయ్యారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు పూనాది పాఠశాల విద్యనుంచే ఆరంభం అవతుందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులను మంచి మార్గంలో నడిపించేది గురువులేనని చెప్పారు. విద్యార్థులు గురువులను గౌరవించాలన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులందరికి మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ ఉపాధ్యాయులు అల్లయ్యగౌడ్, దాదాబాషా, మాదన్న, సంతోష్‌కుమార్, అబ్దుల్‌రహీం, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల సమతుల్యతతో మంచి దిగుబడులు



రైతుల అవగాహన కల్పిస్తున్న జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు జీఎం వేదమణి

కోసిగి: వ్యవసాయంలో ఎరువుల సమతుల్యత పాటించడంతో ఏ పంటలోనైనా మంచి దిగుబడి పొందవచ్చునని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు జీఎం వేదమణి సూచించారు. శనివారం మండలంలోని దుద్ది రైతు సేవాల కేంద్రంలో ఏఈఓ వరప్రసాద్ ఆధ్వర్యంలో పంటలపై రైతులకు శిక్షణ కార్యాక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయంలో జీవసంబంధ ఎరువుల వినియోగం భూమికి ఎంతో మేలు చేస్తుందన్నారు. రసాయానికి ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని సూచించారు. అనవసరంగా రసాయానికి ఎరువుల వాడకంతో భూసారం కోల్పోయి పంటల దిగుబడి తగ్గి, నాణ్యత లేకుండా పోతుందని చెప్పారు. కార్యక్రమంలో కమ్యూనిటీ నాచురల్ ఫ్మారింగ్ రాజన్న, సతీష్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఇంద్రాణి, రైతులు పాల్గొన్నారు.